క్లుప్తంగా

సమస్యలపై 140 ఫిర్యాదులు



వినతులు స్వీకరిస్తున్న అధికారులు

సదుం: మండలంలోని తిమ్మానాయనపల్లెలో భూ సమస్యలపై రెవెన్యూ అధికారులు మంగళవారం గ్రామసభ నిర్వహించారు. సమస్యలపై 140 ఫిర్యాదులు అధికారులకు అందాయి. వీటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వారు చెప్పారు. డీటీ కుమార్, సర్పంచ్ మురళీరెడ్డి, సర్వేయర్ నాగభూషణం, వీఆర్వో మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

మెరుగైన దిగుబడులకు సూచనలు పాటించాలి



మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

సదుం: మామిడిలో మెరుగైన దిగుబడులకు అధికారుల సూచనలు పాటించాలని జిల్లా ఉద్యానవనశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి, శాస్త్రవేత్త సోమశేఖర్ రైతులకు సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో మామిడిలో పూత దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండలంలోని రైతులకు మంగళవారం ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హార్టీకల్చర్ ఆఫీసర్ సంతోషికుమారి, ఏఓ హరిప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

పురవీధుల్లో విహరించిన ఎర్రకోట గంగమ్మ



ఊరేగింపులో ఎర్రకోట గంగమ్మ

పుంగనూరు: పట్టణంలోని ప్రకాశం కాలనీలో మంగళవారం ఎర్రకోట గంగమ్మ పురవీధుల్లో విహరించారు. కర్ణాటకలోని ఎర్రకోట నుంచి గంగమ్మ ఉత్సవమూర్తి విగ్రహాలను తెప్పించి, పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని మేళతాళాలతో ఊరేగించారు. ఈసందర్భంగా పెద్ద సంఖ్యలో మహిళలు అమ్మవారికి కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించారు.

వీరాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

కుప్పంరూరల్: కుప్పం మండలం, గుట్టపల్లి కాలనీ వద్ద మంగళవారం ఘనంగా వీరాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య మంగళవారం హోమం, గణపతిపూజ, ప్రాణప్రతిష్ఠ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా కాలనీలో శ్రీరామ, ఆంజనేయస్వామి నామస్మరణ మారుమోగింది. బుధవారం వీరాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారని నిర్వాహకులు తెలిపారు.

హాస్టళ్ల తనిఖీ



ఎస్సీ హాస్టల్‌లో వంట గదిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

పలమనేరు: పట్టణంలోని పలు హాస్టళ్లను పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత స్థానిక ఎస్సీ బాలికల హాస్టల్‌లో అక్కడున్న సిబ్బంది చాలాసేపు గేట్లు తెరవలేదు. ఆపై లోనికెళ్లి గమనించగా హాస్టల్ వార్డెన్ అందుబాటులో లేరు. అక్కడి సిబ్బంది పొంతనలేని సమాధానంపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. అక్కడి సౌకర్యాలు సరిగ్గా లేవని గమనించారు. అనంతరం పట్టణంలోని ఇతర హాస్టళ్లను పరిశీలించి అక్కడున్న సౌకర్యాలపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. హాస్టల్ వార్డెన్లు అందుబాటులో ఉంటూ పిల్లలకు అవసరమైన సౌకర్యాలను కల్పించాలని ఆయన ఆదేశించారు. టీడీపీ నేతలు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి మండలంలో పేర్నాంబట్ అంతర్రాష్ట్ర రహదారి



రెండు రాష్ట్రాల సరిహద్దులోని మట్టి రోడ్డు



ప్రగతికి దారేది?

- అంతర్రాష్ట్ర రహదారికి గ్రహణం
- దశాబ్దాలుగా బైరెడ్డిపల్లి వాసులకు తప్పని సమస్య
- ఏపీ సరిహద్దు దాకా తారురోడ్డు
- తమిళనాడు సరిహద్దులో అర కిలోమీటరే పెండింగ్
- రోడ్డు పూర్తయితే బైరెడ్డిపల్లి నుంచి పేర్నాంబట్‌కు అరగంటే ప్రయాణం
- పారిశ్రామికాభివృద్ధికి మార్గం

పలమనేరు: జిల్లాలోని పలమనేరు రెవెన్యూ డివిజన్ తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు సరిహద్దుగా ఉంది. తమిళనాడు రాష్ట్రం నుంచి పలమనేరు ప్రాంతానికి దగ్గరి రహదారులున్నాయి. అయితే రాష్ట్ర సరిహద్దులో రోడ్డు పనులు దశాబ్దాలుగా ప్రారంభానికి నోచుకోలేదు. రెండు రాష్ట్రాల సరిహద్దులో కౌండిన్య అభయారణ్యం ఉంది. దీంతో ఈ రహదారులకు అటవీశాఖ అభ్యంతరాలతో ఇప్పటి దాకా గ్రహణం పట్టుకుంది. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని బైరెడ్డిపల్లి నుంచి తమిళనాడులోని పేర్నాంబట్‌కు దారి సమస్య పరిష్కారానికి గత ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న దశలో ఎన్నికలు రావడంతో ప్రక్రియ ఆగింది. ఇందుకు సంబంధించి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవ చూపారు. ఇది పూర్తయితే బైరెడ్డిపల్లి, పుంగనూరు, మదనపల్లి పట్టణాలకు తమిళనాడు నుంచి రవాణా సౌకర్యం కలుగుతుంది. దీంతో ఈ ప్రాంత అభివృద్ధి సాధ్యమవుతుంది.

అర కిలోమీటరే సమస్య

పలమనేరు నియోజకవర్గంలోని బైరెడ్డిపల్లె నుంచి కడపనత్తం మీదుగా పేర్నాంబట్‌కు అడవిమార్గంలో రహదారి ఉంది. బైరెడ్డిపల్లి నుంచి కేవలం 17 కి.మీల దూరమున్న ఈ రహదారి చాలా దగ్గర కావడంతో ఇది స్థానికులకెంతో సౌకర్యవంతంగా ఉంటుంది. బైరెడ్డిపల్లె నుంచి పేర్నాంబట్‌కు వెళ్లాలంటే ప్రస్తుతం వి.కోట మీదుగా లేదా పలమనేరు నుంచి గుడియాత్తం వెళ్లి 60 కి.మీ చుట్టుకొని వెళ్లాల్సి వస్తోంది. బోర్డర్‌లో అర కిలోమీటర్ నిర్మాణం పూర్తయితే కేవలం అరగంటలో బైరెడ్డిపల్లి నుంచి పేర్నాంబట్‌కు చేరుకోవచ్చు. బైరెడ్డిపల్లె నుంచి రాష్ట్ర సరిహద్దు వరకు ఇప్పటికే తారురోడ్డు పూర్తయింది. మరోవైపు పేర్నాంబట్ నుంచి తమిళనాడు ప్రభుత్వం వారి సరిహద్దు వరకు పక్కా రోడ్డు నిర్మించింది. అయితే కౌండిన్య అటవీ ప్రాంతంలో మన రాష్ట్ర పరిధిలో ఒక కిలోమీటర్, తమిళనాడు పరిధిలో అర కిలోమీటర్ మాత్రమే పెండింగ్‌లో ఉంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఇరు రాష్ట్రాల సరిహద్దుల్లోని ప్రజాప్రతినిధులు నడుం బిగిస్తే అంతర్రాష్ట్ర రోడ్డు సమస్య తీరుతుంది.

ఈ రోడ్డుతో ఎంతోమేలు

పలమనేరు, బైరెడ్డిపల్లె మండలాల నుంచి తమిళనాడు రాష్ట్రంలోకి దూరం తగ్గుతుంది. వాహనాల రాకపోకలు జరిగి స్థానికులకు మేలు జరుగుతుంది. దీంతోపాటు అక్కడి వ్యాపారులు ఈ ప్రాంతానికి వస్తారు. తమిళనాడుకు చెందిన పలు పరిశ్రమలు ఇక్కడ స్థాపించే అవకాశం ఉంది. దీంతో ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ముఖ్యంగా పేర్నాంబట్ నుంచి వయా బైరెడ్డిపల్లి మీదుగా మదనపల్లికి రవాణా సౌకర్యాలు వస్తే ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది.

30 గ్రామాలకు రవాణా సౌకర్యం

పలమనేరు మండలంలోని పెంగరగుంట నుంచి చెత్తపెంట దాకా ఇప్పటికే రోడ్డు సౌకర్యం ఉంది. అక్కడి నుంచి బాపలనత్తం, నెల్లిపట్లకు మట్టిరోడ్డు ఉంది. బైరెడ్డిపల్లె మండలంలోని నెల్లిపట్ల మీదుగా తమిళనాడులోని అరట్లకు ఇప్పటిదాకా ఇబ్బందికరంగా రాకపోకలున్నాయి. బైరెడ్డిపల్లి నుంచి పేర్నాంబట్‌కు రోడ్డు సౌకర్యం వస్తే ఈ ప్రాంతం నుంచి 20 అటవీ ప్రాంత గ్రామాలకు తమిళనాడులోకి వెళ్లే సౌకర్యం వస్తుంది. మరోవైపు బైరెడ్డిపల్లి మండలంలోని పది గ్రామాలకు అత్యంత సమీపంగా తమిళనాడులోని మార్గం రానుంది.

రెండు కిలోమీటర్లే సమస్య..



పేర్నాంబట్ నుంచి వయా బైరెడ్డిపల్లి మీదుగా మదనపల్లికి బ్రిటీష్ వారు వేయించిన రోడ్డు ఇది. రెండు రాష్ట్రాల ఘాట్‌లో దారి మూసుకుపోయింది. మా పరిధిలోని రెండు కి.మీ సీసీ రోడ్డు వేసినా సరిపోతుంది. గుడియాత్తం ఎమ్మెల్యేతో మాట్లాడి అక్కడి ప్రభుత్వం ద్వారా కొంత రోడ్డు పనులు చేయిస్తే రాకపోకలు మొదలవుతాయి.

–మొగసాల రెడ్డెప్ప, ఎంపీపీ, బైరెడ్డిపల్లి

ఇది దశాబ్దాల కల..



బైరెడ్డిపల్లి నుంచి పేర్నాంబట్‌కు కడపనత్తం, నెల్లిపట్లల మీదుగా రెండు దగ్గర మార్గాలున్నాయి. ఇరు రాష్ట్రాల్లోని సరిహద్దుల వరకు ఆయా రాష్ట్రాల బస్సు సౌకర్యం ఉంది. కేవలం కిలోమీటర్ రోడ్డు సమస్య తీరితే అంతర్రాష్ట్ర బస్సు సర్వీసులు వస్తాయి. ఈ ప్రాంతం బాగా అభివృద్ధి చెందుతుంది. ఇది ఈ ప్రాంత వాసులు దశాబ్దాల కల. ఈ ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరిస్తే సంతోషపడతాం.

–విశ్వమోహన్, వ్యాపారి, బైరెడ్డిపల్లి

గ్రామసభల్లో సమస్యల హోరు



గ్రామసభలో అర్జీలు తీసుకుంటున్న అధికారులు

పలమనేరు: మండలంలోని పెంగరగుంటలో మంగళవారం జరిగిన రెవెన్యూ గ్రామసభలో సమస్యలు హోరెత్తాయి. ఈసందర్భంగా అదే గ్రామానికి చెందిన సుధాకర్ తన పొలాన్ని కొంతమంది ఆక్రమించుకున్నారని అర్జీ ఇచ్చారు. దీంతోపాటు రెవెన్యూ సమస్యలపై ఎక్కువగా అర్జీలందాయి. తహసీల్దార్ ఇన్బునాథన్, సిబ్బంది హనుమంతు పాల్గొన్నారు.

బేబీ కిట్ల పంపిణీ



బేబీ కిట్లు వితరణ చేస్తున్న సభ్యులు

వి.కోట: అంతర్జాతీయ సేవా సంస్థ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలోని మాతృమూర్తులకు పండ్లు, అల్పాహారం, చంటి బిడ్డలకు బేబీ కిట్లు వితరణగా అందజేశారు. వి.కోట లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ధీరజ్, సభ్యులు తుకారం, లాభూరాం, బాలగురునాథ్, రమేష్, మురుగేష్, లక్ష్మణ్, చంద్రశేఖర్, శబరీష్ పాల్గొన్నారు.

రేపటి నుంచి మహాభారతం

పులిచెర్ల(కల్లూరు): రేపటి నుంచి మండలంలోని కొమ్మిరెడ్డిగారిపల్లెలో మహాభారత మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త వల్లివేడు రాజారెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు ధ్వజారోహణం, 7నుంచి 17వ తేదీ వరకు మహాభారత మహోత్సవంలో భాగవతారిణి సీతాలక్ష్మి హరికథా గానం చేస్తారని పేర్కొన్నారు.

పంచాయతీ పనితీరుపై నివేదిక

గుడుపల్లె: గ్రామస్తుల ఫిర్యాదు మేరకు గ్రామ పంచాయతీకి సంబంధించిన పనితీరుపై మంగళవారం పరిశీలించి ఉన్నతాధికారులు ఎంపీడీఓ రాధక్రిష్ణన్ నివేదికను పంపారు. వారం రోజుల క్రితం పెద్దబదినవాడ గ్రామస్తులు పంచాయతీలోని సర్పంచ్ అందుబాటులో లేరని గ్రామంలో నెలకున్న సమస్యలు తీర్చేవారు లేరని, నిధులు పక్కదారి పట్టాయని జిల్లా కలెక్టర్‌కు గ్రామస్తులు ప్రజావేదికలో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు గ్రామ పంచాయతీ పనితీరుపై పరిశీలించి నివేదిక అందించాలని కలెక్టర్ ఎంపీడీఓను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశానుసారం పెద్దబదినవాడ గ్రామ పంచాయతీలో గ్రామస్తుల ఆధ్వర్యంలో రికార్డులను పరిశీలించి వాటికి సంబంధించిన వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు.



పంచాయతీలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

సమాచారం పొందడం హక్కు

శాంతిపురం: సమాచారహక్కు చట్టం–2005(ఆర్టీఐ) ద్వారా ఏ అధికారి నియంత్రణలోని సమాచారమైనా పొందడం ప్రతి పౌరుడి హక్కు అని మండల వ్యవసాయాధికారి అప్పోజి చెప్పారు. మఠం, ఎంకేపురం రైతు సమాచార కేంద్రాల్లో రైతులు, సిబ్బందికి మంగళవారం ఆయన ఆర్టీఐపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ యంత్రాంగ నిర్ణయాలు, పనులు, వ్యయం పారదర్శకంగా ఉండేందుకు ఈ చట్టం అమల్లో వచ్చిందన్నారు. పౌరుడు అడిగిన సమాచారాన్ని సంబంధిత అధికారి 30 రోజుల్లోపు అందించాలన్నారు. నకలు ప్రతులు, సీడీ, పెన్‌డ్రైవ్‌ల రూపంలో సమాచారాన్ని అధీకృత అధికారి నుంచి పొందవచ్చని చెప్పారు. నిర్ణీత సమయంలో సమాచారం ఇవ్వని అధికారిపై అప్పిలేట్ అధికారిని, రాష్ట్ర సమాచార కమిషన్‌ను ఆశ్రయించవచ్చన్నారు. సమాచారం జారీ చేయడంలో జాప్యం చేసే అధికారులకు రోజుకు రూ.250 చొప్పున రూ.25 వేల వరకు జరిమానా విధిస్తారని చెప్పారు. రైతులు, రైతు సమాచార కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ అప్పోజీ

ఆధునిక పద్ధతుల్లో పండించాలి



కుప్పిగానిపల్లెలో వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ

గుడుపల్లె: ఆధునిక పద్ధతుల్లో పంటలను పండించాలని వ్యవసాయశాఖ అధికారి నాగరాజు అన్నారు. మంగళవారం కుప్పిగానిపల్లె, యామగానిపల్లెల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయశాఖ అనుసంధాన శాఖల ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖల నుంచి రైతులకు వచ్చే రాయితీలను వివరించారు. అనంతరం రైతులు పండించిన వరి పంటలను పరిశీలించారు.

విద్యార్థి అదృశ్యం

రామకుప్పం: స్థానిక గిరిజన గురుకుల పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థి సోమవారం అదృశ్యమైనట్లు రామకుప్పం పోలీసులకు ఫిర్యాదు అందింది. కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్ తెలిపిన వివరాలు.. కొర్లాలకొండకు చెందిన శేఖర్‌నాయక్ కుమారుడు అభిషేక్‌నాయక్ రామకుప్పం గిరిజన గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. సోమవారం నుంచి విద్యార్థి పాఠశాలలో కనిపించకుండాపోయాడు. పాఠశాల నిర్వాహకులు విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. దీంతో విద్యార్థి తండ్రి శేఖర్‌నాయక్ తన కుమారుడు కనపడుటలేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విద్యార్థి ఆచూకీ కోసం పోలీసులు గాలించగా తప్పిపోయిన విద్యార్థిని మంగళవారం రాత్రి తల్లిదండ్రులకు అప్పగించినట్లు సీఐ మల్లేష్‌యాదవ్ తెలిపారు.

ఎస్టీపీ ప్లాంట్ స్థలం పరిశీలన

పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలో తోపుమఠం వద్ద రెండు ఎకరాల్లో సీవేజ్ ట్రీట్‌మెంట్ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి సంబంధించిన భూమి సేకరణ స్థలాన్ని జాయింట్ కలెక్టర్ విద్యాధరి మంగళవారం పరిశీలించారు. కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ రాముతో కలసి ఆమె తోపుమఠం వద్దగల రెండు ఎకరాల భూమిని పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. స్థలసేకరణ పనులను త్వరగా చేపట్టి, నివేదికలు పంపాలని అధికారులను ఆదేశించారు. కాగా ప్లాంటు నిర్మాణాన్ని రూ.4 కోట్లతో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సహకారంతో నిర్మించేందుకు మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతిపాదనలు పంపి మంజూరు చేయించారు. ఆర్ఐ ఫణీంద్ర, సర్వేయర్లు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.



తోపుమఠం వద్ద భూమి రికార్డులు పరిశీలిస్తున్న జేసీ విద్యాధరి, కమిషనర్, తహసీల్దార్

కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ భూముల సర్వే

చౌడేపల్లె: మండలంలోని గోసలకురప్పల్లె వద్ద వెలసిన కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయానికి చెందిన భూములను మంగళవారం సర్వే నిర్వహించినట్లు ఈఓ కమలాకర్ తెలిపారు. దేవదాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈఓ సమక్షంలో సర్వేయర్లు పద్మజ, చంద్రశేఖర్ కలసి ఆలయానికి చెందిన 178/1,2, 179/1,3, 108/2 సర్వే నంబర్లలో ప్రైవేట్ బస్టాండ్, పరిసర కూడలి ప్రాంతంలో 2.14 ఎకరాల విస్తీర్ణం భూమి కలదు. సర్వే నంబర్ల వారీగా సరిహద్దులు గుర్తించి, ఆక్రమణదారులను గుర్తించారు. రెవెన్యూ అధికారుల సమన్వయంతో ఆలయానికి చెందిన మాన్యం భూమిని గుర్తించి ఆక్రమణదారులు ఎంతమేరకు ఆక్రమించారో వివరిస్తూ నివేదికను జిల్లా కలెక్టర్, దేవదాయశాఖ అధికారులకు పంపనున్నట్లు ఈఓ తెలిపారు. సిబ్బంది హరి పాల్గొన్నారు.



చౌడేపల్లెలో సర్వే చేస్తున్న ఈఓ కమలాకర్, సర్వేయర్లు

భక్తిశ్రద్ధలతో నాగులచవితి

పుంగనూరు: నాగులచవితిని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని కోనేటి వద్ద వెలసిన నాగదేవతలకు భక్తులు పూజలు చేశారు. మంగళవారం నాగులచవితిని పురస్కరించుకుని నాగదేవతలకు పాలు పోసి, పూలమాలలు వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా పుట్టల్లో కోడిగుడ్లు, పాలు పోసి నాగదోష నివారణ పూజలు చేశారు.

రామకుప్పంలో...

రామకుప్పం: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ఆవరణలోని పుట్టలో మహిళలు పాలుపోసి మొక్కులు చెల్లించారు. అనంతరం సుబ్రహ్మణ్యస్వామిని దర్శించుకున్నారు.



పుంగనూరులో నాగదేవతలకు పూజలు

ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లండి: సీఐ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

వి.కోట: విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకెళితే ఎటువంటి సమస్యనైనా ధైర్యంతో ఎదుర్కోవచ్చని సీఐ సోమశేఖర్‌రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మండల మహిళా రక్షకులతో కలసి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం యువత విలాసాలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తూ మత్తుపదార్థాలకు బానిసలై వారి నిండుజీవితాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అఘాయిత్యాలకు కారణం సెల్‌ఫోన్ల వినియోగమే ప్రధాన కారణమని తెలిపారు. యువత సెల్‌ఫోన్ల వినియోగం పూర్తిగా తగ్గించాలని సూచించారు.

సొంతింటికి ఎదురుచూపులు



జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న గృహాలు

సదుం: గత ప్రభుత్వం పేద వాడి సొంతింటి కల నెరవేర్చేందుకు పలు ప్రోత్సాహకాలు అందించింది. పలుచోట్ల సొంతంగా ఇళ్ల స్థలాలను పేదలకు మంజూరు చేసి గృహాలను నిర్మించుకునేందుకు ఆర్థిక సాయం అందజేసింది. దీంతో పలువురు తమ సొంతింటి కలను సాకారం చేసుకున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో కొత్త గృహాల మంజూరు కోసం అర్హులైన లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. కాగా నూతన గృహాల మంజూరుపై ఇప్పటి వరకు స్పష్టత లేకుండాపోయింది. గత ప్రభుత్వంలో ఎర్రాతివారి పల్లె మార్గంలో, బూరగమంద రామాపురంలో జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి 104 మందికి ఇళ్ల స్థలాలను మంజూరు చేశారు. వీటిలో ఇప్పటికే 42 గృహాల నిర్మాణపనులు పూర్తయ్యాయి. మండల వ్యాప్తంగా 1,513 గృహాలను గత ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో 1,080 మంది లబ్ధిదారులు అప్పటి ప్రభుత్వ ప్రోత్సాహకాలతో తమ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేశారు. ప్రస్తుతం 90 గృహ నిర్మాణాలు బేస్‌మెంట్ స్థాయిలో, 140 గోడలు, 102 మోల్డింగ్ స్థాయిలో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం గతంలో ఇళ్ల నిర్మాణాలకు అందించే మొత్తం పెంచుతామని హామీ ఇవ్వడంతో పలువురు అందుకోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. గతంలో పనులు ప్రారంభించిన వారు సైతం తమకు ఆ లబ్ధిచేకూరుతుందన్న ఆశతో పనులు పూర్తిచేయకుండా వేచిచూస్తున్నారు. గత లబ్ధిదారులకు ప్రభుత్వం ఆ మేలును చేకూరుస్తుందో లేదో చూడాల్సి ఉంది.



పునాదులకే నిలిచిన ఇల్లు

నిర్మాణాల పూర్తికి చర్యలు..

మండలంలో పెండింగ్ గృహ నిర్మాణాల పూర్తికి చర్యలు తీసుకుంటున్నాం. నూతన గృహాల మంజూరుకు ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు ఇంకా అందలేదు. రాగానే నూతన గృహాల మంజూరుకు చర్యలు తీసుకుంటాం.

అరుణ్‌దాస్, హౌసింగ్ ఏఈ, సదుం.